



సువర్ణ కవచం అవతారంలో శ్రీబాలాత్రిపుర సుందరి అమ్మవారు

ఘనంగా కరప దసరా సంబరం



కరపలో ఊరేగుతున్న హంస ప్రతిమలు

కరప, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన కరప దసరా సంబరం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. గ్రామంలోని పల్లపువీధి, మెరక వీధి, కొత్తపేట, నీలయ్యతోట రామాలయం నుంచి ఏనుగు వాహనాలు, బీసీపేట, సీతమ్మపేట, రామదాసుగుడి, ఎస్సీ పేట నుంచి హంస వాహనాలను నిర్వాహకులు రం గురంగుల విద్యుద్దీపాలంకరణతో అందంగా ముస్తాబు చేశారు. వాటి ముందు బ్యాండు మేళాలు, వివిధ రకాల సజ్జలు బారులుతీరగా పలు సాంస్కృతిక ప్రదర్శనలతో రాత్రి తెల్లవార్లూ గ్రామోత్సవం జరిపారు. తెల్లవారుజామున ఏనుగు, హంస వాహనాలను ఎదురెదురుగా ఉంచి జమ్మి పత్రితో శమీపూజ చేశారు. ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా పోలీసులు వాహనాలను వేరే మార్గాల్లో మళ్లించారు. కాకినాడ ఎస్డీపీవో దేవరాజ్‌మనీష్ పాటిల్ గ్రా మంలో పర్యటించి పోలీసులకు సూచనలిచ్చారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కరప, తిమ్మాపురం, ఇంద్రపాలెం, గొల్లపాలెం ఎస్ఐలు తోట సునీత, గణేష్, వీరబాబు, మోహన్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు. మెరకవీధి రామాలయం వద్ద ఆరు వేల మందికి అన్నదానం చేశారు. జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, జనసేన నేత దేవు మధువీరేష్, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, నక్కా సత్తిబాబు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా కాకినాడ సూర్యారావుపేటలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బాలా త్రిపురసుందరి అమ్మవారు విజయదశమినాడు సువర్ణ కవచం అవతారంలో దర్శనమిచ్చారు. నవావరణార్చన, చండీహోమం జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుమారు 50 వేలకుపైగా తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



ఆటో డ్రైవర్లకు.. ఆనందం

- 35,538 మంది అర్హులు
- ఒక్కో డ్రైవర్‌కు రూ.15 వేలు
- నేడు ఖాతాల్లో రూ.53 కోట్లు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

సూపర్ సిక్స్ పథకాల అమలుతో సక్సెస్‌ఫుల్ పాలన దిశగా వెళుతున్న కూట మి సర్కారు ఈసారి ఆటోకార్మికులకు అండగా నిలుస్తోంది. స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన ప్రభుత్వం.. తాజాగా 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన ఆటో డ్రైవర్లు, మాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థికసాయం అందజేయనుంది. శనివారం ఉమ్మడి జిల్లాలోని అర్హులైన డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో రూ.53 కోట్ల సొమ్ము వేయనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36,630 మంది డ్రైవర్లు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 14,722 మంది దరఖాస్తు చేసుకోగా 12966 మందిని అర్హులుగా ప్రభుత్వం నిర్ధారించారు. తూర్పుగోదావరి జిల్లాలో 13,147 మంది దరఖాస్తు చేసుకోగా 11,915 మంది అర్హులుగా తేలింది. 172 దరఖాస్తులు తిరస్కరించగా 81 దరఖాస్తులను హోల్డ్‌లో ఉంచింది. కోనసీమ జిల్లాలో స్వల్పంగా 8,491 దరఖాస్తులే దాఖలయ్యాయి. 7709 దరఖాస్తులకు అధికారులు ఆమోదముద్ర వేశారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 35,538 మంది దరఖాస్తులకు ఆమోదం లభించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అర్హులైన ఆటోడ్రైవర్లకు రూ.11.56 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 11,915 మంది ఆటో డ్రైవర్లకు రూ.17.87 కోట్లు, కాకినాడ జిల్లాకు సంబంధించి రూ.19.45 కోట్లు ఆర్థిక సాయం అందించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులందరికీ రూ.15 వేల చొప్పున రూ.53 కోట్ల నగదు శనివారం బ్యాంకు ఖాతాల్లో జమకానుంది. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా అమరావతి నుంచి శనివారం కార్యక్రమం ప్రారంభిస్తారు. తూర్పుగోదావరి జిల్లా కార్యక్రమం రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో శని వారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి నిమ్మల రామానాయుడు హాజరవుతారు. ప్రతి జిల్లాలోనూ ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు ఆరంభిస్తారు.



కారులో మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎలక్ట్రిక్ కారు దగ్ధం

కాకినాడ క్రైం, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఎలక్ట్రిక్ కారు దగ్ధమైంది. నగరంలోని నాగమల్లితోట కూడలి సమీపంలో కోనసీమ జిల్లా ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు నివాసముంటున్నారు. ఆయన సమీప బంధువు సాగిరాజు శ్రీహరిరాజు ఇటీవల ఎలక్ట్రిక్ కారు కొనుగోలు చేశారు. శుక్రవారం రాత్రి దానిని ఎమ్మెల్యే ఇంటి వద్ద నిలిపి ఉంచారు. బ్యాటరీ షార్ట్‌సర్క్యూట్ కావడంతో కారులోంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు అగ్నిమాపక శకటం, సిబ్బందితో సంఘటనా స్థలికి హుటాహుటీన చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆస్తి నష్టం రూ.10 లక్షలు ఉంటుందని ఆయన చెప్పారు.



డిజిటల్ అరెస్ట్!

సెట్టు వేస్తారు.. సెట్ చేసి కొట్టేస్తారు!

మోసం ఇలా..

ఇతర రాష్ట్రాల నుంచి సైబర్ నేరగాళ్లు వివిధ ప్రాంతాల్లోని డాక్టర్లు, బడా వ్యాపారులు, విశ్రాంత ఉద్యోగుల వివరాలు తెలుసుకుంటారు. దీని కోసం స్థానికంగా ఉన్న యువకులకు ఉద్యోగాలిచ్చి ఆయా ప్రాంతాల్లోని ప్రముఖుల నెంబర్లు సేకరించి తతంగం ఆరంభిస్తారు. ఓ గదిలో పోలీస్ అధికారి గది మాదిరిగా సెట్టు వేస్తారు. స్కైప్, వాట్సాప్, టెలిగ్రాం ద్వారా కాల్ చేస్తారు. డీపీలు పోలీసుల డ్రెస్సులో ఫొటోలే ఉంటాయి. ఎస్పీ, డీఐజీ, ఐజీ వంటి పెద్ద హోదాల పేర్లతో పరిచయం చేసుకుని ఐడీ కార్డు చూపిస్తారు. వివిధ కారణాలను చూపుతూ ఆయా వ్యక్తుల అనుపానువులకు అనుగుణంగా భయపెడతారు. ఎవరైనా కాస్త వాయిస్ పెంచి ప్రశ్నిస్తే నకిలీ అరెస్టు వారెంట్లు మెసెంజర్ ప్లాట్ ఫాంల ద్వారా పంపిస్తారు. ఎవరికైనా ఈ విషయం చెబితే ఇంటికి వచ్చి సంకెళ్లు వేసి తీసుకెళతామని బెదిరిస్తారు. కేసులో ఉన్న సొమ్మును డిపాజిట్ చేయాలని హుకుం జారీ చేస్తారు. ఒక వేళ నిర్దోషి అని తేలితే వెనక్కి ఇచ్చేస్తామంటారు. సైబర్ కేటుగాళ్లు తాము చెప్పిన చిన్న చిన్న బ్యాంకు ఖాతాలకు ఆర్టీజీ ఎస్ ద్వారా సొమ్ములు జమ చేసుకుంటారు. వాటిని వెంటనే డ్రా చేసేస్తారు. లేదా భారీ కొనుగోళ్లకు ఈ డబ్బులను చెల్లిస్తారు.

డిజిటల్ అరెస్ట్ లేనేలేదు..

సెట్టు వేసి డబ్బులు కొట్టేయడమే డిజిటల్ అరెస్టులో ముఖ్యాంశం. ఇటువైపు వ్యక్తి భయం పైనే పూర్తిగా ఆధారపడి మోసం చేస్తారు. అక్రమంగా సంపాదించిన వాళ్లు తమ లావాదేవీలు బయట పడతాయనే భయంతో కొందరు మోసపోతున్నారు. ఇందులో ఎక్కువగా డాక్టర్లు, ప్రభుత్వ అధికారులు ఉండడం గమనార్హం. డిజిటల్ అరెస్టు చట్టంలో ఎక్కడా లేదు. కేవలం ఊహ మాత్రమే.

రాజమహేంద్రవరంలో ఓ ప్రముఖ డాక్టర్‌కి స్కైప్ ద్వారా వీడియోకాల్ వచ్చింది. అవతల యూనిఫాంలో ఉన్న ఓ పోలీసు ఉన్నతాధికారి మాట్లాడుతున్నారు. ఆ అధికారి కూర్చున్న గదిలో జాతీయ పతాకం, బ్యానర్ వంటివన్నీ ఉన్నాయి.. మీరు విదేశాలకు హవాలా ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు పంపిస్తున్నట్టు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నాడు. అరెస్టు వారెంట్, ఏవేవో పోలీస్ ముద్రలతో ఉన్న పత్రాలను చూపించాడు. డిజిటల్ అరెస్టు చేస్తున్నామని చెప్పారు. ఎవరికైనా ఈ విషయం చెబితే ఇంటికొచ్చి అరెస్టు చేస్తామని భయపెట్టారు. ముందుగా మనీ లాండరింగ్‌లో తాము గుర్తించిన రూ.3.50 కోట్లు డిపాజిట్ చేయాలని..కేసులో మీ ప్రమేయమేమీ లేదని తేలితే ఆ డబ్బు తిరిగి ఇచ్చే స్తామని చెప్పాడు. ఆ డాక్టరు దఫదఫాలుగా నెల రోజుల్లో రూ.3.50 కోట్లు డిపాజిట్ చేసేశాడు. ఆ తర్వాత విషయం తెలిసింది. ఆ డాక్టరు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్ర యించాడు. ఓ రూ.40 లక్షలు హోల్డు చేశారు. మిగతా సొమ్ము సైబర్ నేరగాళ్లు స్వాహా చేసేశారు..

- (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇది మరోచోట జరిగిన ఘటన.. డిజిటల్ అరెస్టు అంటూ ఓ 35ఏళ్ల లేడీ డాక్టర్‌ను భయపెట్టి వివస్త్రను చేశారు. పలానా చోట పుట్టుమచ్చలు ఉంటే మీరే నిందితులని, తమకు నిర్ధారణ చేయాలంటూ పోలీస్ దుస్తుల్లో ఉన్న కేటుగాళ్లు నమ్మించారు. స్క్రీన్ రికార్డింగ్ ద్వారా ఆ మహిళ వివస్త్రగా ఉన్న వీడియో తీశారు. అది చూపించి రూ.8 లక్షలు దోచేశారు.

ఇది రాజమహేంద్రవరంలోనే జరిగిన ఘటన.. సింగరేణి కాలరీస్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ తర్వాత ఇక్కడ స్థిరపడ్డారు. ఆయనకు స్కైప్ కాల్ వచ్చింది. హవాలాలో అతని అకౌంట్ ద్వారా విదేశాలకు డబ్బు వెళ్లిందని, కేసులు తేలే వరకూ డిజిటల్ అరెస్టులు చేస్తున్నామని చెప్పారు. రూ.60 లక్షలు దోచేశారు. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏడాదిలో 20 కేసులకుపైగా నమోదయ్యాయి. రాజమండ్రికి చెందిన ఎయిర్ పోర్ట్ విశ్రాంత ఉద్యోగిని కూడా వారం రోజులు డిజిటల్ అరెస్టు పేరుతో ఇంట్లో నిర్బంధించేశారు.

డిజిటల్ అనే పదాన్ని ఉపయోగించి ఏకంగా అరెస్టులు చేసేస్తున్నారు. బాగా చదు వుకున్నోళ్లు సులభంగా అరెస్టై, కాలు కదప డం లేదు. ఆర్థిక నేరాలకు సంబంధించి డిజిటల్ అరెస్టు ఓ పెద్ద సమస్యగా పరిణమించింది. కస్టమ్స్, ఆదాయపు పన్ను శాఖ, కేంద్ర దర్యాప్తు ఏజెన్సీల అధికారులుగా వ్యవ హరిస్తూ పేరున్న వ్యక్తులు, ప్రముఖులు, ధనవంతులను మోసం చేసి డబ్బు కాజేస్తు న్నారు.ప్రధాని మోదీ సైతం 'మన్ కీబాత్' రేడియో ప్రసంగంలో డిజిటల్ అరెస్టుల బా రినపడొద్దని హెచ్చరించారంటే..ఊహాజనిత అరెస్టు సమాజంపై ఎంతటి ప్రభావం చూపిస్తోందో అర్థం చేసుకోవచ్చు.

- ఉమ్మడి జిల్లాలో 20కిపైగా కేసులు
- ప్రముఖులే టార్గెట్‌గా వ్యవహారం
- అక్రమ లావాదేవీలే పెట్టుబడి
- భయపెట్టి భారీగా లాగుడు
- మోసపోతున్న ఉన్నత చదువరులు
- రూ.3.50 కోట్లు ఇచ్చేసిన ఓ డాక్టర్
- రిటైర్డ్ ఉద్యోగులు సైతం బలి
- డిజిటల్ అరెస్టు.. చట్టంలో లేదు
- డబ్బు దోపిడీకి గురైతే వెనక్కి రాదు
- అప్రమత్తతే ఆయుధం

డౌట్ వస్తే.. డయల్ 112

కాల్ వస్తే వ్యక్తిగత, ఆర్థిక, బ్యాంకు తదితర సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదు.ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు చెప్పకూడదు. లింక్‌లను క్లిక్ చేయకూడదు. ఫోన్‌లో కాల్- బ్లాకింగ్ ఉపయోగించడం ద్వారా మోసపూరిత నెంబర్లు బ్లాక్ చేయవచ్చు. సైబర్ మోసగాళ్లని అనుమానం వచ్చిన వెంటనే 112కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఒకవేళ అప్పటికే మోసపోతే 1930కి ఫిర్యాదు చేయవచ్చు. నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ నేరాల్లో ఒకసారి డబ్బు నేరస్తుల చేతిలోకి వెళితే తిరిగి మళ్లీ మన చేతుల్లోకి రావడం దాదాపుగా అసాధ్యమని చెప్పవచ్చు. ఒకవేళ అప్పటికే మన అదృష్టం కొద్దీ బ్యాంకు ఖాతాలో మిగిలిన సొమ్మును పోలీసులు హోల్డు చేసినా.. కోర్టు, బ్యాంకుల నిబంధనలను దాటుకొని మన జేబులోకి వచ్చేసరికి కనీసం ఏడాది పడుతుంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పనులపై కలెక్టరేట్లో శుక్రవారం ఆయన పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(పాడా) అధికారులు, డ్వామా, పంచాయతీరాజ్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, మినీ గోకులాలు, నీటికుంటలు, ప్రహరీల పనుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను వేగంగా చేయాలన్నారు. పనులు పూర్తి చేసి బిల్లులు అప్‌లోడ్ చేయని వాటి వివరాల నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో పాడా ఇన్‌చార్జి పీడీ వేణుగోపాలరావు, ఏపీడీ వసంతమాధవి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి నారాయణ ఏలేశ్వరం రాక

ప్రత్తిపాడు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద వాహనసేవా పథకాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగూరి నారాయణ శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా చెప్పారు. ఆటో కార్మికులకు రూ.15 వేల సహాయం అందించే ఈ పథకాన్ని మంత్రి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంచేసేందుకు ఆటో కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే కోరారు.

జీఎస్టీపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ షాన్‌మోహన్



వ్యవసాయ యంత్రాల ధరల తగ్గింపును రైతులకు వివరిస్తున్న కలెక్టర్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలు వినియోగించే వస్తువులపై ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో చేకూరే లాభాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ షాన్‌మోహన్ పిలుపునిచ్చారు. జీఎస్టీ తగ్గింపు నేపథ్యంలో ధరలు తగ్గిన వ్యవసాయ శాఖ యంత్రాలు, అనుబంధ శాఖల యంత్రాలు, ట్రాక్టర్లతో శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ ఆవరణలో ప్రదర్శన నిర్వహించారు. ఏ యంత్రాల ధరలు ఏ మేరకు తగ్గాయో వివరిస్తూ ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేశారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ యంత్రాలపై గతంలో ఉన్న 12 శాతం జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించారన్నారు.దీని వల్ల రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడి ఆదాయం రెట్టింపు అవుతుందన్నారు. ట్రాక్టర్లపై 12 శాతం జీఎస్టీని 5 శాతానికి, ట్రాక్టరు టైర్లపై 12 శాతం జీఎస్టీని 5 శాతానికి, డ్రోన్లపై 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించారన్నారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ తగ్గిస్తూ చేపట్టిన సంస్కరణలతో దేశ ప్రగతిలో విప్లవాత్మక మార్పులు ఆవిష్కరించనున్నాయన్నారు. కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాసు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్రంలో ప్రజలకు రూ.8వేల కోట్లు ఆదా అవుతుందన్నారు. ట్రాక్టర్ల ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులు ర్యాలీ నిర్వహించి జీఎస్టీ తగ్గింపు ధరలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జీఎస్టీ జాయింట్ కమిషనరు శ్రీలక్ష్మి, వ్యవసాయ శాఖ జేడీ విజయ్‌కుమార్ హాజరయ్యారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారిగా నియమితులైన ఎన్.రామచంద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన కె.కృష్ణమూర్తి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ మీనా, ట్రైనీ కలెక్టర్ మనీషా

గాంధీ భవన్‌లో మహాత్ముని జయంతి

కార్పొరేషన్/క్రైం (కాకినాడ), అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): కాకినాడ గాంధీ భవన్ అధ్యక్షుడు వీఎల్ గాంధీ ఆధ్వర్యంలో జరిగిన గాంధీ జయంతి వేడుకలకు జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ మనీషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహాత్ముని విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారికి గాంధీభవన్ ఆవిర్భావం, చరిత్రను వైఎస్‌వీఎస్ మూర్తి, కార్యదర్శి వక్కలంక రామకృష్ణ వివరించారు. గాంధీ చిత్రకళా ప్రదర్శనను ట్రైనీ కలెక్టర్ ఆసక్తిగా పరిశీలించారు. పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పీఆర్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భారతలక్ష్మి, సంస్థ కోశాధికారి వాసా సత్యనారాయణమూర్తి, అల్లూరి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే గాంధీ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మహాత్ముని చిత్రపటానికి ఎస్పీ జి.బిందుమాధవ్ పుష్పమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాకినాడ ఎస్డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్, ఎస్బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కిటకిటలాడిన సత్యదేవుడి ఆలయం

అన్నవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం రాత్రి జరిగిన శమీపూజతో ముగిశాయి. వర్షం కారణంగా శమీపూజ కొండపై నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు దర్బారు మండపంలో ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించారు. జమ్మిమొక్కను అక్కడ ఉంచి పండితులు ప్రత్యేక పూజలు చేశారు.భక్తులతో అర్చకులు శమీశమియతే పాపం, శమీ శత్రువినాసినీ అర్జునస్య ధనుర్ధారి రామస్య ప్రియదర్శిని అనే మంత్రాన్ని పఠింపచేశారు. అనంతరం చతుర్వేదపండితులు వేదాశీర్వచనం గావించారు. చివరిరోజున అమ్మవారు రాజరాజేశ్వరీ అలంకరణలో దర్శనమిచ్చారు. కొండదిగువ కళాశాల మైదానంలో రావణదహనం కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈవో సుబ్బారావు విల్లును చేతబూని రావణదహనం కార్యక్రమం నిర్వహించారు. సత్యదేవుడి సన్నిధి శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది. దసరా సందర్భంగా విజయవాడ నుంచి ఉత్తరాంధ్రకు వెళ్లే భవానీ భక్తులు మార్గమధ్యలో స్వామిని దర్శించుకున్నారు. గురువారం రాత్రి సత్యదేవుడి సన్నిధిలో వివాహం చేసుకున్న జంటలతో పాటుగా వివిధ ప్రాంతాల్లో స్వామిని ఒక్కటైన జంటలు స్వామివారి సన్నిధిలో వ్రతమాచరించుకున్నారు.



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



శమీపూజ చేస్తున్న అర్చకులు

ఎస్పీ కార్యాలయంలో ఆయుధ పూజ



కాకినాడక్రైం, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.బిందుమాధవ్ దంపతులు ఆయుధపూజ నిర్వహించారు. రివాల్వర్లు, రైఫిళ్లు, అత్యాధునిక ఆయుధాలు, పెట్రోలింగ్ వాహనాలకు ఎటువంటి ఆటంకాలు కలగకూడదని దుర్గామాతను ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో మరింత అంకితభావం, నిబద్ధతతో పనిచేయాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎస్డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్, ఎస్బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్భలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.



సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్



రోబోటిక్ సర్జరీ యంత్రాలు

సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.

ములకలచెరువు కేంద్రంగా
నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు



నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, అనంద న్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన స య్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభు త్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయ చంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు



హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్





మహాశక్తి యాగం చివరి రోజు అమ్మవారికి హారతి ఇస్తున్న స్వామి పరిపూర్ణానంద సరస్వతి, లలితా సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ముగిసిన మహా క్రతువు

- కాకినాడ శ్రీపీఠంలో వైభవంగా మహాశక్తి యాగం పూర్ణాహుతి
- దిగ్విజయంగా శతకోటి లలితా సహస్రనామ కుంకుమార్చన

సర్పవరం జంక్షన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో పదకొండు రోజులు జరిగిన 3వ మహాశక్తి యాగం గురువారం ముగిసింది. వెయ్యి కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చన లక్ష్యంతో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు మహా క్రతువు నిర్వహించారు. మూడు పర్యాయాలుగా జరిగిన మహాశక్తి యాగంలో వేలాది మంది భక్తుల నడుమ ఇప్పటివరకు 300 కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చన పూర్తి చేసుకున్నట్టు పరిపూర్ణానంద తెలిపారు. ఈ మహా క్రతువులో భాగస్వాములైన మహిళామూర్తులంతా ధన్యులేనన్నారు. త్రికరణ శుద్ధి కలిగిన మనసుతో ఓ తపస్సులో భక్తులు పాల్గొని శతకోటి కుంకుమార్చనలో భాగస్వాములుగా నిలిచారని, వీరికి అమ్మ అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రపంచం గుర్తించేలా ప్రముఖ ఆధ్యాత్మిక శక్తికి కాకినాడ బిందువు కావాలనేదే తన ఆకాంక్ష అన్నారు. వెయ్యికోట్ల కుంకుమార్చనతో ఇక్కడో ఓ మహాశక్తిని చూస్తారన్నారు.



పూర్ణాహుతిలో ద్రవ్యాలు సమర్పిస్తున్న స్వామి

గత 25 సంవత్సరాలుగా శ్రీపీఠం ఆస్థాన విద్వాంసులుగా సంగీత సేవలందిస్తున్న వినుకోట వెంకటేశ్వరరావు బృందాన్ని ఘనంగా సత్కరించగా శ్రీపీఠం ఛైర్మన్ పిన్నమనేని సుధీర్‌రాజు సువర్ణ అంగుళీకాలను ప్రదానం చేశారు. చివరిరోజున ఐశ్వర్యాంబిక అమ్మవారికి రజత కవచంతో విశేష అలంకరణ చేశారు. వేద పండితులు, రుత్వికుల మంత్రోచ్ఛారణలతో పలు రకాల విశేష ద్రవ్యాలతో స్వామి పరిపూర్ణానంద చేతులమీదుగా మహా పూర్ణాహుతిని అత్యంత వైభవంగా జరిపారు.

వాడపల్లి వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలకు
పందిరిరాట ముహూర్తం

ఆత్రేయపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ఆలయంలో వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు జరిపి పందిరిరాట ముహూర్తం చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఈవో, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను సచివాలయంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు మంత్రులు వాసంశెట్టి సుభాష్, నిమ్మల రామానాయుడు, సవిత, కొండపల్లి శ్రీనివాసరావుకు వాడపల్లి ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు అందించారు. ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేసి శాలువాలతో సత్కరించారు.



దేవదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం



పందిరిరాటకు పూజ చేస్తున్న అర్చకస్వాములు. చిత్రంలో ఈవో సూర్యచక్రధరరావు

దేశంలో మరోసారి స్వదేశీ ఉద్యమం

- మేకిన్ ఇండియాతో స్వయం సమృద్ధి
- ఖాదీ సంతలో స్టాళ్లు తిలకించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు మరోసారి స్వదేశీ ఉద్యమానికి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్య మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖాదీ సంతను చివరి రోజైన శుక్రవారం ఆయన సందర్శించారు. అక్కడ ఏర్పాటుచేసిన స్టాళ్లను తిలకించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ నడిపిన స్వదేశీ ఉద్యమాన్ని ప్రధాని స్ఫూర్తిగా తీసుకున్నారన్నారు. స్వదేశీ అంటే పాత చింతకాయ పచ్చడి కాదని, నిత్య నూతనమని వ్యాఖ్యానించారు. ఆత్మ నిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి నినాదాలతో ఆర్థిక స్వావలంబన కోసం అడుగులు వేస్తున్నామన్నారు. రక్షణ రంగం, విదేశాంగ విధానం, మన దేశ ఆర్థిక విధానం, విదేశీ పెట్టుబడులు తదితర అన్ని విషయాల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఖాదీ ఉత్పత్తులను మరింత ప్రోత్సహించడానికి అవసరమైతే సినీ నటులను కూడా ప్రచారంలో ఉపయోగించుకునే ఆలోచన ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన చౌదరి, ఖాదీ సంత కన్వీనరు క్షత్రియ బాలసుబ్రహ్మణ్య సింగ్, నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, రొంగల గోపి, నర్సిపల్లి హారిక, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణారావు, కరుటూరి శ్రీనివాసరావు, వీరా వీరాంజనేయులు, కాలెపు సాయిరామ్, శెట్టిపల్లి శివనాగరాజు పాల్గొన్నారు. స్వదేశీ వస్తు వినియోగంపై మద్దిపాటి రజని ప్రతిజ్ఞ చేయించారు.



ఖాదీ సంతలో వస్త్రాలను చూస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మహిళలు

సామర్లకోట భీమేశ్వరాలయంలో
కార్తీక మాస ఉత్సవాలకు శ్రీకారం

సామర్లకోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో కార్తీక మాస ఉత్సవాలకు అర్చకులు శుక్రవారం రాట ముహూర్తం చేశారు. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), సభ్యులు చీమలకొండ వీరభద్ర ప్రసాదరావు, అలోక్‌చంద్ర జైన్, బాడితమాని లక్ష్మి, మండపల్లి భాను వెంకటపద్మ, తాతపూడి అరుణ్‌వంశీ, గొలితి సత్యనారాయణ పాల్గొన్నారు.



రాట ముహూర్తం చేస్తున్న ఈవో, పాలకమండలి సభ్యులు

ఉమ్మడి జిల్లా టెన్నిస్ ఎంపికలకు 70 మంది క్రీడాకారుల హాజరు



టెన్నిస్ పోటీలకు ఎంపిక నిర్వహిస్తున్న వ్యాయామోపాధ్యాయులు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అండర్-14, 17 స్కూల్ గేమ్స్ ఎంపికలు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి పర్యవేక్షణలో జరిగాయి. టెన్నిస్ ఎంపికలకు 70 మంది బాల, బాలికలు హాజరయ్యారు. వ్యాయామోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరిరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, సీనియర్ పీడీలు ఎల్.జార్జి, పట్టాభిరామం, టెన్నిస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రవిరాజు పాల్గొన్నారు.

అవార్డుల పంట...

స్వచ్ఛ పంచాయతీ రాష్ట్రస్థాయి అవార్డుకు ‘లొల్ల’ ఎంపిక



లొల్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆత్రేయపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్మూలనలో లొల్ల గ్రామం ఆదర్శనీయంగా నిలిచి రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డుకు ఎంపికైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల పంచాయతీ స్వచ్ఛ అవార్డుకు ఎంపిక కోసం ఈనెల 6న చంద్రబాబు చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ కాయల జగన్నాథం స్వచ్ఛ భారత్ అవార్డును అందుకోనున్నారు. లొల్ల పంచాయతీలో ముగ్గురు గ్రీన్ అంబాసిడర్లతో ఇంటింటికి వెళ్లి తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరించడంతో పాటు వర్మికంపోస్టు తయారు చేశారు. చెత్త నుంచి సంపద సృష్టించి స్వచ్ఛ రహిత గ్రామంగా తీర్చిదిద్దడంలో సర్పంచ్ జగన్నాథం, కార్యదర్శి కృష్ణామాచార్యులు ఎంతగానో కృషిచేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా లొల్ల గ్రామంలో 90 శాతం అపారిశుధ్యం నిర్మూలించడంలో తీవ్ర కృషిచేశారు. ఈ నేపథ్యంలో లొల్ల పంచాయతీ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది.

అందరి సహకారంతోనే సాధ్యం...



ప్రజలందరి సహకారంతోనే తమ గ్రామం రాష్ట్ర స్థాయిలోనే ఆదర్శనీయంగా నిలవడం హర్షనీయం. గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి తడిచెత్త, పొడి చెత్తను సేకరించడంలో ప్రజలు ఎంతగానో సహకరిచడం ద్వారానే ఇది సాధ్యమైంది. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల సమష్టి కృషితో తమ గ్రామం ఈ అవార్డుకు ఎంపిక కావడం ఆనందదాయకం.

సర్పంచ్, కాయల జగన్నాథం

‘తూర్పు’కు మూడు రాష్ట్ర స్థాయి అవార్డులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమానికి సంబంధించి తూర్పుగోదావరి జిల్లాకు జిల్లాకు మూడు రాష్ట్రస్థాయి అవార్డులు, 51 జిల్లా స్థాయి అవార్డులు వచ్చినట్టు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం ప్రకటించారు. ఈనెల 6న అవార్డులు అందుకోనున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల కేటగిరీలో 2 విభాగాల్లోనూ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. ఇన్‌చార్జి కమిషనర్‌గా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఉన్నారు. స్వచ్ఛ బస్టేషన్ కేటగిరీలో కొవ్వూరు బస్టాండ్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. ఆర్టీసీకి చెందిన వై.కుమార్ అందుకోనున్నారు.

స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్ విభాగంలో పి.వెంకటాపురం ఆశ్రమ స్కూల్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంపై ప్రతీ నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిన కాకినాడ రూరల్ పి.వెంకటాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ ఆశ్రమ స్కూల్ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్) ప్రతిష్టాత్మక స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది. బాలికల గురుకుల ఆశ్రమంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు నెలలో ప్రతీ మూడో శనివారం విద్యార్థులు, అధ్యాపకుల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం కోసం మొక్కల పెంపకం, సంరక్షణ, ఆరోగ్య సంరక్షణపై స్కూల్ ప్రిన్సిపాల్ పరిమళ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మెరుగైన పనితీరు కనబరుస్తున్న పాఠశాలలను ఇటీవల ప్రభుత్వం నియమించిన కమిటీ సందర్శించి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బాలిక గురుకుల పాఠశాల్లో మూడో శనివారంతోపాటు సెలవు రోజుల్లో పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంతో పచ్చదనం వెల్లివిరిసేలా విద్యార్థులు, అధ్యాపకులు సమష్టిగా కృషి చేయడంతో ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపిక చేసినట్టు శుక్రవారం ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రస్థాయిలో తమ స్కూల్‌కి రావడం పట్ల ప్రిన్సిపాల్ పరిమళ ఆనందం వ్యక్తం చేశారు.

‘ఎలైట్’కు స్వచ్ఛ పరిశ్రమ అవార్డు

పెద్దాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన అవార్డుల్లో స్వచ్ఛ పరిశ్రమ (ఎంఎస్ఎంఈ) అవార్డును ఎలైట్ ఇనుస్ట్రుమెంట్స్ పరిశ్రమ దక్కించుకుంది. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో ఈ అవార్డు దక్కించుకున్నట్టు ఎలైట్ ఇనుస్ట్రుమెంట్ కమర్షియల్ మేనేజర్ కృష్ణ తెలిపారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ క్లీన్ ఇండస్ట్రీ పాలసీని అనుసరిస్తున్నందుకు స్వచ్ఛ పరిశ్రమ అవార్డును పొందింది.

తునిలో మృతదేహం కలకలం

ముఖంపై దారుణ గాయాలు

కొట్టి చంపారనే అనుమానాలు



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

తుని రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణంలో వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. తుని రైల్వే ఫ్లైఓవర్ నర్సీపట్నం బస్టాండ్ సమీపంలో ముఖంపై దారుణమైన గాయాలతో గుర్తు పట్టలేనంతగా ఉన్న యువకుడి మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలను రప్పించి ఆధారాలు సేకరించారు. ఎవరైనా కొట్టి చంపి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖంపై తప్ప ఎక్కడా ఎటువంటి గాయాలు కనిపించడం లేదు. సమీపంలో ఉన్న ఒక మద్యం బాటిల్‌ను స్వాధీనం చేసుకుని అది ఎక్కడ కొనుగోలు చేశారనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పరిశీలించారు. వివిధ కోణాల్లో దర్యాప్తుకు సంబంధించి స్థానిక పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైలు నుంచి జారి పడి వృద్ధుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న తుని రైల్వే పోలీసులు

తుని రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సుమారు 78 ఏళ్ల వృద్ధుడు కుటుంబసభ్యులతో ప్రయాణం చేస్తూ మార్గమధ్యలో హంసవరం రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తూ జారి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. బంధువులు టోల్‌ఫ్రీకి ఫోన్ చేయగా జీఆర్పీ పోలీసులు వివరాలు తెలియపరిచారు. దీంతో బంధువులు తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని నిర్ధారించడంతో పంచనామాల అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించినట్టు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి...

రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో అన్నవరం రైల్వేస్టేషన్‌లో జరిగింది. గురువారం జరిగిన ఈ ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు వెల్లడించారు. 35 ఏళ్ల వ్యక్తి మరణించాడని, మృతికి గల కారణాలు తెలియరాలేదన్నారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లేవని తుని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ మోహన్‌రావు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో కానీ 94906 19020 నెంబర్‌ను కానీ సంప్రదించాలని ఆయన కోరారు.

సామర్లకోటలో...

సామర్లకోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో మొదటి ప్లాట్‌ఫాం పట్టాలు దాటుతున్న వ్యక్తిని గుంటూరు నుంచి విశాఖ వైపు వెళ్తున్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొన్న సంఘటనలో అక్కడికక్కడే మృతిచెందాడు. సింహాద్రి ఎక్స్‌ప్రెస్ లోకోపైలట్, ట్రైన్‌మేనేజరులు స్టేషన్ సూపరింటెండెంట్‌కు అందించిన సమాచారంతో రైల్వే ఎస్ఐ, ఆర్పీఎఫ్ ఎస్ఐలు సంఘటనా స్థలికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. రైలు ఢీకొనడంతో మృత దేహం 2ముక్కలుగా విడిపోయినట్టు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని గుర్తించేందుకు పోలీసులకు ఏ వివరాలు లభ్యం కాకాపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

దసరా.. సరదా!

- అంబరాన్నంటిన అమలాపురం దసరా ఉత్సవాలు
- ఉభయ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలు
- డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మీనా ఆధ్వర్యంలో బందోబస్తు
- ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు



అమలాపురంలోని ఓ వీధిలో విన్యాసాల దృశ్యం



పట్టణంలో ఊరేగిన ఓ వాహనం



ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన



అగ్నితో అబ్బురపరుస్తూ...

అమలాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సంబరం అంబరాన్నంటింది.. ఆనందం ఉరకలేసింది.. వీధులన్నీ ఒక్కటయ్యాయి.. దసరా శోభను సంతరించుకున్నాయి.. పోటాపోటీగా ఉత్సవాలను నిర్వహించారు. అమలాపురం అంతా ఆనందంతో నిండిపోయింది. విజయదశమి పర్వదినం సందర్భంగా గురువారం అమలాపురం లో జరిగిన చెడీ తాలింఖానా ఉత్సవ ఊరేగింపులు కనుల పండువగా జరిగాయి. వేలాది మంది ప్రజలు ఉత్సవాలను తిలకించారు. భారీ బందోబస్తు నడుమ అమలాపురంలోని వివిధ ప్రాంతాల్లోని ఏడు వీధులకు చెందిన ఉత్సవ ఊరేగింపుల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు చెడి తాలింఖానా ప్రదర్శనలు చూపరులను కనువిందు చేశాయి. ఒక్కో వీధికి ఒక్కో వాహనాన్ని ఊరేగింపుగా పురవీధుల గుండా తీసుకువచ్చారు. అమలాపురం పట్టణం చెడీతాలింఖానా జాతరతో గురువారం రాత్రి కిక్కిరిపోయింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి స్వయంగా వారే దగ్గరుండి పర్యవేక్షించారు. ఏటా మాదిరిగానే ఉభయ రాష్ట్రాల నుంచి వేలాదిగా ప్రజలు అమలాపురంలో చెడీ తాలింఖానా ఉత్సవాలను చూసేందుకు తరలివచ్చారు. ముఖ్యంగా పట్టణంలోని గండువీధి, రవణంవీధి, రవణం మల్లయ్యవీధి, నల్లా వీధి, మహిపాలవీధి, కొంకాపల్లి, శ్రీరామపురంలకు చెందిన ఊరేగింపుల్లోని కొన్నిటిలో చెడీ తాలింఖానా విన్యాసాలు అలరించాయి. కళ్లకు గంతలు కట్టుకుని పొట్టపై కొబ్బరికాయలు, కూరగాయలు ఉంచి కత్తితో నరికేందుకు చేసే అద్భుత విన్యాసం చెడీ తాలింఖానాల్లో ప్రత్యేక సంతరించుకుంది. కర్రసాములు, కత్తిసాము, అగ్గి బరాటా విన్యాసాలతో ఉత్సవాలను రక్తికట్టించారు.

సందడి చేసిన ప్రజాప్రతినిధులు



కత్తులతో ప్రదర్శన చేస్తున్న ప్రజాప్రతినిధులు

అమలాపురంలో జరిగిన చెడీ తాలింఖానా ఉత్సవాలను వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సందర్శించారు. ఆయా ఉత్సవ కమిటీల ఆహ్వానం మేరకు ఆయా వీధుల్లో తిరిగి పటాకత్తులు చేతబట్టి విన్యాసాలు చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడుతో పాటు బీజేపీ నాయకుడు నల్లా పవన్‌కుమార్, అడబాల సత్యనారాయణ, యాళ్ల దొరబాబు, జనసేనకు చెందిన అనేక మంది నాయకులు ఆయా పురవీధుల్లో తిరుగుతూ ఊర్రూతలూగించారు.

డీఐజీ పర్యవేక్షణ..



పర్యవేక్షిస్తున్న డీఐజీ, ఎస్పీ

అమలాపురంలో జరిగిన చెడీ తాలింఖానా ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. డ్రోన్లు, బాడీ టచ్ కెమెరాలు, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేశారు. ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు రాత్రి ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో పర్యటించి బందోబస్తును పర్యవేక్షించారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. అవాంచనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత పరిస్థితుల నడుమ దసరా ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో అటు పోలీసు యంత్రాంగం, ఇటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

సరదగా బయలుదేరి అంతలోనే కన్నుమూసి..

బైక్‌ను ఢీకొన్న కారు

అక్కడికక్కడే ఇద్దరు మృతి

ఒకరికి తీవ్రగాయాలు



ప్రమాదానికి కారణమైన కారు



మృతి చెందిన ఓ వ్యక్తి

పెరవలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం నల్లాకుల వారిపాలెం జాతీయ రహదారి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఖండవల్లికి చెందిన కంతేటి పోసియ్య (20), బొంతు వెంకటేశ్వరరావు (34), ఇంజేటి ఇస్సాకు (49) వ్యవసాయ కూలీలు. గురువారం రాత్రి సరదగా తణుకు పయనమయ్యారు. ఖండవల్లి నుంచి తణుకు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా అదే సమయంలో రావుల పాలెం నుంచి తణుకు వెళ్తున్న ఇన్నోవా కారు వేగంగా వచ్చి వీరిని ఢీకొంది. దీంతో పోసియ్య, ఇస్సాకు అక్కడికక్కడే మృతిచెందారు. వెంకటేశ్వరరావు తీవ్ర గాయపడగా తణుకు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

కొబ్బరి చెట్టును ఢీకొన్న ఆటో వ్యక్తి మృతి

రాయవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని బుట్టాయపేట రహదారిలో ఆటో కొబ్బరి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. రాయవరం ఎస్ఐ. డి. సరేష్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంటూరు గ్రామానికి చెందిన దుగ్గిరాల రాంబాబు(57) విజయదశమిని పురస్కరించుకుని చెల్లూరు శివారు బుట్టాయిపేటలో బంధువుల ఇంటి వద్ద భవానీ మాలదారులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వెళ్లాడు. అక్కడ నుంచి ఆటోలో తిరిగి వస్తున్న సమయంలో గురువారం సాయంత్రం బుట్టాయి పేట రహదారి చెంతనే ఉన్న కొబ్బరి చెట్టును ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో రాంబాబుకు గాయాలయ్యాయి. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాంబాబుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ఆటో ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు మరికొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆధునికీకరణకు రూ.3 వేల కోట్ల కేటాయింపు అడిగా : మంత్రి నిమ్మల



రాజోలులో శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే దేవ

మలికిపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలో పేరుకుపోయిన పనులను పూర్తి చేయడానికి రూ.2వేల నుంచి రూ.3వేల కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లానని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో శంకరగుప్తం డ్రైయిన్ పరీవాహక ప్రాంతంలో చనిపోయిన కొబ్బరి చెట్లను గురువారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ ఐదు సంవత్సరాల విధ్వంసంతో కాల్వలు, డ్రెయిన్లు పాడైపోయాయని, ముందు చూపుతో వ్యవహరించకపోతే కాటన్ దొరకు ముందు ఈ ప్రాంత పరిస్థితులు ఎలా ఉండేవో అదే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారన్నారు. 1990లో ముఖ్యమంత్రి చెన్నారెడ్డి ఉండగా కాల్వలు, డ్రెయిన్లు ఆధునికీకరించారని, మళ్లీ లేదన్నారు. 34 నియోజకవర్గాల పరిధిలో ఈ పనులు చేపట్టడానికి సర్వే చేయడం కోసం అధికారులు రూ.15 కోట్లు అంచనా వేశారని, ఆ ప్రాజెక్టు రిపోర్టు తయారుచేయడానికి రూ.15 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. ఆధునికీకరణతోనే 34 నియోజకవర్గాల పరిధిలోని కాల్వలు, డ్రెయిన్లు ప్రక్షాళన జరుగుతుందన్నారు. కేశనపల్లి పంటకాల్వ పనులపై కూడా దృష్టి పెడతానన్నారు. గతంలో సస్యశ్యామలంగా ఉండే గోదావరి జిల్లాల కంటే మెట్ట ప్రాంతాల్లో రైతుల పరిస్థితి నేడు చాలా బాగుందన్నారు. ఆధునికీకరణ జరిగితే రైతులు పరిస్థితి మెరుగవుతుందని ఆయన చెప్పారు.

రాతి కట్టుబడికి మంత్రి నిమ్మల శంకుస్థాపన

రాజోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాజోలులో వశిష్ఠ గోదావరి నది ఏటిగట్టును పటిష్ఠం చేసేందుకు ఒక కిలోమీటరున్నర వరకు రూ.25.10 కోట్లతో రాతి కట్టుబడికి మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాజోలు ఏటిగట్టు రక్షణ గోడకు శంకుస్థాపన చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఇటుక తీసి ఇటుక పెట్టిన పాపాన పోలేదని, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు చేపట్టారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ అహర్నిశలు పనిచేస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క నీటి ప్రాజెక్టును పట్టించుకోలేదని విమర్శించారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చొరవతో మరిన్ని అభివృద్ధి పనులు నియోజకవర్గంలో చేపడతానని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చిట్టచివరి ప్రాంతం రాజోలు నియోజకవర్గమని, వశిష్ఠ గోదావరి ఇక్కడ బంగాళాఖాతంలో కలుస్తుందని తెలిపారు. వరదల సమయంలో అనేక ఇబ్బందులు ఇక్కడి ప్రజలు పడుతున్నారని, ఒకటిన్నర కిలోమీటరు రాతి కట్టుబడి గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉందని తెలిపారు. రాజోలులో రూ.7 కోట్లతో ఏటిగట్టును ఎత్తుచేసే ప్రతిపాదన కూడా మంత్రి నిమ్మల అంగీకారం తెలపడం పట్ల ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అమలాపురం ఆర్డీవో కె.మాధవి, అడ్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, సీఈ కె.శేషుబాబు, ఎస్ఈ కె.గోపీనాథ్, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, ఎంపీపీ కడలి శ్రీదుర్గ, చాగంటి స్వామి, గుబ్బల ఫణికుమార్, బందెల పద్మ, మంగెన భూదేవి, మోకా పార్వతి పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత





ప్రదర్శనలో దుస్తులను తిలిస్తున్న పీడీజే సునీత, బహుతులు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ అడుగుజాడల్లో మనం నడవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. గురువారం గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారంలో సూపరింటెండెంట్ రాహుల్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సునీత హాజరయ్యారు. గాంధీ ఆదర్శాలు, భావాలను ఖైదీలకు వివరించారు. ఖైదీల సాధికారత కోసం ఉపాధి కల్పనా కోర్సులు, విద్య, ఆరోగ్య సేవలు, న్యాయ విజ్ఞానం, న్యాయ సహాయం, హక్కులు తెలియజేయడంలో జైలు అధికారులు మరింత మెరుగైన చొరవ చూపాలని సూచించారు. మహిళా ప్రత్యేక కారాగారంలో సూపరింటెండెంట్ వసంత కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకలకు 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ ఇంచార్జి కార్యదర్శి బి.పద్మ ముఖ్య అతిథిగా హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు కారాగారాల్లో ఖైదీలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. గాంధీ జయంతి సందర్భంగా వివిధ పోటీల్లోని విజేతలకు పీడీజే సునీత, డీఎల్ఎస్ఏ ఇంచార్జి కార్యదర్శి పద్మ బహుమతులను అందజేశారు.

సమస్యల పరిష్కారానికి 7న ఫ్యాప్టో పోరుబాట

ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ సాయిశ్రీనివాస్



అమలాపురంలో ఫ్యాప్టో పోరుబాట ప్లకార్డులతో నిరసనలో రాష్ట్ర చైర్మన్ సాయిశ్రీనివాస్

అమలాపురం టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల విడుదలపై ఏ చర్యలు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 7న విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో పోరుబాట నిరసన కార్యక్రమం చేపట్టినట్టు రాష్ట్ర చైర్మన్ లంకపల్లి సాయిశ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ఫ్యాప్టో నాయకత్వం పిలుపు మేరకు చేపట్టిన మహాధర్నాలో భాగంగా సన్నాహక సమావేశం ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎంటీవీఏఎస్ సుబ్బారావు అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎస్టీయూ విద్యా భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగాహాజరైన ఫ్యాప్టో చైర్మన్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావస్తున్నా విద్యా పరమైన, ఆర్థిక పరమైన సమస్యలకు పరిష్కారం చూపలేదన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. మధ్యంతర భృతి ప్రకటించకపోగా కనీసం డీఏ బకాయిలు కూడా విడుదల చేయలేదని విమర్శించారు. ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి దొరబాబు, సంఘ సభ్యులు మోకా ప్రకాష్, రాయుడు ఉదయభాస్కర్, నాగిరెడ్డి శివప్రసాద్, పెంకే వెంకటేశ్వరరావు, సరిదే సత్యపల్లంరాజు, షబ్బీర్ హుస్సేన్, గుత్తాల వెంకటేశ్వరరావు, బొంతు వీవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. పోరుబాటను విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు.

స్ఫూర్తి ప్రదాత ‘ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్’



సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి

తణుకు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో కర్మాగారాన్ని స్థాపించి అనేకమందికి ఉపాధి కల్పించిన డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. తణుకు ఆంధ్రా షుగర్స్ కాలనీలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం యువత సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ, వారసత్వ విద్యలను, కళలను పెంచుకోవాలని సూచించారు. యోగా, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలను అందిపుచ్చుకోవాలన్నారు. కుటుంబ విలువల తగ్గిపోతున్న తరుణంలో సంస్థ ఉద్యోగులు అంతా ఒక కుటుంబంలా వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రా షుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య మాట్లాడుతూ షుగర్స్ 500 టన్నుల సామర్థ్యంతో ప్రారంభమై పదివేల టన్నుల సామర్థ్యం వరకు పురోగమించిందన్నారు. అనంతరం పలు పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రవచన రత్నాకర ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ ప్రసంగించారు. సంస్థ ఉద్యోగులు విశ్వనాథకుమార్, సాంబశివరావు, శ్రీనివాసు పాల్గొన్నారు.

వ్యక్తి ఛాతి నుంచి బుల్లెట్ తొలగింపు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి ఛాతిలోకి చొచ్చుకుపోయిన బుల్లెట్‌ను కాకినాడ జీజీహెచ్ సర్జరీ వైద్యులు తొలగించి పునర్జన్మను ప్రసాదించి విజయవంతమయ్యారు. వివరాలిలా ఉన్నాయి. ఏఎస్ఆర్ జిల్లా గంగవరం మండలం చిన్నగార్లపాడుకు చెందిన 31 ఏళ్ల వ్యక్తి గత నెల 25న కోతులను బెదిరించే క్రమంలో నాటు తుపాకీని పేల్చగా ప్రమాదవశాత్తు తుపాకీలోని బుల్లెట్ అతడి ఎడమ ఛాతిలో నుంచి ఊపిరితిత్తులోనికి చొచ్చుకుపోయింది. స్థానికులు సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం బాధితుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నందున మెరుగైన చికిత్స కోసం హుటాహుటిన కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అదేరోజు రాత్రి ప్రాణాపాయంలో ఉన్న బాధితుడికి సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ నరేష్, డాక్టర్ కిరణ్, డాక్టర్ రవి కిరణ్ బృందం శస్త్ర చికిత్స నిర్వహించి చాకచక్యంగా బుల్లెట్‌ను తొలగించారు. బాధితుడు ప్రాణాపాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. వైద్య బృందాన్ని ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి అభినందించారు.

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మకు శుక్రవారం స్వర్ణ, రజత పుష్పార్చన వైభవంగా జరిగింది. మండపంలోని ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్ఠింపజేసి వేదపండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు చేశారు. సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, సిబ్బంది రమణ, వేద పండితులు, ఆసాదులు, భక్తులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

గాంధీజీ స్ఫూర్తితో పరిశుభ్రత పాటించాలి: కలెక్టర్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత, పరిశుభ్రతకు గాంధీజీ అధిక ప్రాధాన్యమిచ్చేవారిని, ఆయన స్ఫూర్తితో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ, గాంధీజీ జయంతిలను పురస్కరించుకుని వాకలపూడిలోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్ద గ్రామ కార్యదర్శి పిడుగు పాండురంగారావు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. వారికోసం రూ.2.45 లక్షలతో నిర్మించిన విశ్రాంతి గదిని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, ఎంపీడీవో పసుపులేటి సతీష్, డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ఆర్ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతుల సంచార యంత్రం ప్రారంభం



రోడ్డు మరమ్మతుల సంచార యంత్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, కలెక్టర్

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో రోడ్ల మరమ్మతుల కోసం రూ.1.48 కోట్లతో కొనుగోలు చేసిన ఇన్‌ఫ్రారెడ్ రీసైక్లింగ్ సంచార యంత్రాన్ని కలెక్టర్ షాన్‌మోహన్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, కమిషనర్ భావన శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. యంత్రం పని తీరును వారు పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, అదనపు కమిషనరు కేటీ సుధాకర్, ఎస్ఈ వెంకటరావు, హెల్త్ ఆఫీసర్ డి.పృథ్వీచరణ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తొలిసారి టీడీపీ కార్యాలయానికి ఎమ్మెల్సీ పద్మశ్రీ



టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తొలిసారిగా కాకినాడలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయానికి విచ్చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి, మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆమె వెంట కర్రి నారాయణ, పుప్పాల చిన్న, కర్రి శ్రీను, బత్తిన శ్రీను, సంగాని వెంకట్, మోసా అబ్రహం వున్నారు.

రూ.58లక్షలతో పీబీసీ ప్రధాన కాలువ గట్టు పటిష్టం



కొండెవరం సమీపంలో పీబీసీ కాలువ గట్టును పరిశీలిస్తున్న తూర్పు డెల్టా చైర్మన్ సునీల్‌కుమార్

కొత్తపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్ చొరవతో రూ.58లక్షలతో పిఠాపురం బ్రాంచి కెనాల్ (పీబీసీ) ప్రధాన కాలువ గట్టు పటిష్టానికి చర్యలు చేపట్టినట్టు గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ అన్నారు. కొండెవరం సమీపంలో పీబీసీ కాలువ గట్టు, రాయూరు హెడ్ ట్యాంక్, వజ్రకాలువ బల్లకట్టు ప్రస్తుత పరిస్థితులను శుక్రవారం ఆయన రైతులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాలువ గట్టు పనులు ప్రారంభించేందుకు రైతుల అభిప్రాయాలను సేకరించారు. పనులకు సంబంధించిన నివేదికను సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇరిగేషన్ ఏఈ భవానీ, నీటి సంఘం అధ్యక్షుడు తోట ప్రసాద్, వాసంశెట్టి శ్రీనివాసరావు, గాది కొండబాబు, పుల్లా కొండబాబు, రాకేష్, గాది రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ 'ప్రజా దర్బార్'కు విశేష స్పందన



సమస్యలు వింటున్న ఎంపీ సతీష్‌బాబు

సామర్లకోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పవరంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 24వ ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించింది. ఎంపీ స్వయంగా ఆశీనులై ప్రజల సమస్యలను సావధానంగా ఆలకించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణానికి రుణం, పింఛన్లు, సీఎం రిలీఫ్ ఫండ్, ఉపాధి అవకాశాలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. డీఎస్సీ అభ్యర్థులకు 1:1 విధానంలో తలెత్తిన సమస్యను పరిష్కరించాలని పలువురు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌తో అప్పటికప్పుడు మొబైల్‌లో సమీక్షించి పరిష్కార మార్గాలను అన్వేషించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, తోట నవీన్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, వీవై దాసు, గింజాల శ్రీనివాసు, ఎంపీ కార్యాలయ ఇన్చార్జి మేకా లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33 కేవీఏ ఫీడర్‌లో అన్ని 11 కేవీఏ ఫీడర్ల వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ఏవీఎస్డీఎస్ ప్రభాకర్ తెలిపారు. బ్రౌన్ పేట, పాత ఎమ్మార్వో కార్యాలయ ప్రాంతం, కుమ్మరి వీధి, గణేష్ కాలనీ, సీతారామ దళిత కాలనీ, బళ్ల మార్కెట్, వీర్రాఘవపురం, తెలు కుల వుంత, పెన్షన్ లైన్, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, మఠం సెంటర్, గోలివారి వీధి, మెహెర్ కాంప్లెక్స్, ఇస్మాయిల్ నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, కాకినాడ రోడ్డులో ఉన్న పెద్దాపురం వాటర్‌వర్క్స్, సామర్లకోట వాటర్‌వర్క్స్, భీమేశ్వరస్వామి గుడి, టిడ్కో గృహ సముదాయం, శంకర్ లే-అవుట్స్, కోదండరామపురం, జల్లూరు డోర్స్ కంపెనీ, నిమ్మ తోట, కొత్తూరు వీధి, స్టేషన్ సెంటర్, సంపంగితోట, సత్యనారాయణపురం, మాజేటి నగర్, ఏడీబీ రోడ్డు, బీఎస్ఆర్ సైట్స్ ప్రాంతాలకు విద్యుత్ సర ఫరా నిలిపివేస్తామని ఏడీఈ కిరణ్, అర్బన్ ఇన్చార్జి ఏఈ నాగేశ్వరరావు చెప్పారు.

చిత్రాడలో రూ.లక్ష విలువైన బాణసంచా స్వాధీనం

పిఠాపురం రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఎటువంటి అనుమతి లేకుండా భారీగా బాణసంచా సామగ్రి నిల్వ చేశారనే సమాచారంతో కేదారశెట్టి వెంకటేశ్వర్లు ఇంట్లో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐ మణికుమార్, పోలీసులు తనిఖీలు జరిపారు. రూ.లక్ష విలువైన దీపావళి సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఎక్స్‌ప్లోజివ్స్, బీఎన్ఎస్ చట్టాల కింద కేసులు నమోదు చేశారు. దీపావళి సందర్భంగా అనుమతి లేకుండా బాణసంచా నిల్వచేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

వైభవంగా దుర్గమ్మ, సత్తెమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠ

పిఠాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ, సత్తెమ్మ తల్లి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ వేదపండితుల మంత్రోచ్చారణలతో వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాణకర్త బాలిపల్లి రాంబాబు దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



సామర్లకోటలో 30 కిలోల వెండి చీర అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో హంస వాహనంపై విహరిస్తున్న రాజరాజేశ్వరీ సమేత కుక్కుటేశ్వరస్వామి

జయహో దుర్గాభవానీ

పిఠాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో 11 రోజులు జరిగిన రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల శరన్నవరాత్ర శత చండీ యాగ మహోత్సవాలు ముగిసాయి. విజయదశమి పర్వదినాన రాజరాజేశ్వరీదేవిని విజయదుర్గగా అలంకరించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిగింది. పురుహూతికా అమ్మవారికి సహస్ర పుష్పార్చన, శ్రీచక్ర లక్ష కుంకుమార్చన, రాజరాజేశ్వరీదేవికి సామూహిక విశేష కుంకుమార్చనలు, సాయంకాల ప్రత్యేకార్చనలు, మహా నివేదన, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. శతచండీయాగ పూర్ణాహుతి జరిపారు. ఈవో, సహాయకమిషనరు కాట్నం జగన్మోహనశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్ల వీధి, రైల్వేస్టేషన్ రోడ్డు, కూరగాయల మార్కెట్, చిట్టోడితోట, సూరవరపు వారి వీధి, మంగాయమ్మరావుపేట, పశువుల సంత వద్ద గల కనకదుర్గమ్మ ఆలయాల్లో కుంకుమ పూజలు జరిగాయి. గుట్ల వీధి కనకదుర్గమ్మ ఆలయం వద్ద నుంచి దసరా సంబరాలు ఆకట్టుకున్నాయి. వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కూరగాయల మార్కెట్‌లో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. దసరా పర్వదినాన తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గుట్టల వీధి, కాయగూరల మార్కెట్ ఆలయాల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, మహాలక్ష్మి ఆలయంతో పాటు పట్టణంలోని పలు ఆలయాల్లో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు పూజలు చేశారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండు, కరణంగారితోట, ఈబీసీ కాలనీ, నందిరాయి వీధి, దేవినగర్ ప్రాంతాల్లోని ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా అమ్మవార్ల దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. రాత్రి వరకు రద్దీ కొనసాగింది. కుంకుమార్చనలు, సహస్రనామార్చనలు జరిగాయి. ఆయా ఆలయాల కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): దుర్గాడ శివాలయంలో లలితాదేవి మాతా పరమేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు లలితా సహస్రనామ కుంకుమార్చన చేశారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులకు శమీ పూజ నిర్వహించారు. తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అపర్ణాదేవిని రాజరాజేశ్వరీదేవిగా పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. రాత్రి ఆలయ ప్రాంగణంలోని జమ్మి చెట్టు వద్ద శమీ పూజ జరిగింది.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారిని 30 కిలోల వెండి చీరతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో జమ్మి చెట్టు వద్ద ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన శమీ పూజలో డీసీసీబీ అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), కంటే జగదీష్‌మోహన్ (బాబు), అడబాల కుమారస్వామి, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ (చిన్ని), బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. భేతాళస్వామి ఉత్సవాల ముగింపు అనంతరం గ్రామోత్సవం నిర్వహించి ఉత్సవ విగ్రహానికి ఉద్వాసన పలికారు. అంతకు ముందు జరిగిన సంబరంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి, గుమ్మళ్ల రామకృష్ణ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొండపల్లి జగ్గారావు, గుణ్ణం సూర్యారావు, కొండపల్లి సూరన్నచౌదరి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్ చౌదరి, ఎంపీటీసీ పాలకుర్తి రేవతీసతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వరనగర్‌లో అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని జమ్మి చెట్టుకు పుల్లేటికుర్తి సుబ్రహ్మణ్య శివాచార్య ఆధ్వర్యంలో వైభవంగా శమీ పూజ జరిపారు. జమ్మి చెట్టుకు అపరాజితాదేవిగా అలంకరణ చేయగా మండవిల్లి నాగేశ్వరరావు-భాగ్యలక్ష్మి దంపతులు పూజ చేశారు. పూజ్యం సూర్యనాగ విశ్వ చైతన్య శర్మ శమీ పూజ విశిష్టతను భక్తులకు వివరించారు. ఆలయ స్థల దాతలు మల్లవరపు విశ్వేశ్వరరావు, వైజయంతి కుటుంబ సభ్యులు, మల్లిడి గోపాలకృష్ణారెడ్డి-వీరలక్ష్మి దంపతులు, రాజసింహారెడ్డి, బేబి, శరణ్య, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల ముగింపులో భాగంగా కొత్తపల్లి గాజులదొడ్డిలో కనకదుర్గమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మతో పాటు కొత్తపల్లి, పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు ప్రసాదం స్వీకరించారు. కుతుకుడుమిల్లిలో జైభేతాళ స్వామి సంబరం ఘనంగా జరిగింది. భేతాళస్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కర్రసాముల నడుమ కుతుకుడుమిల్లి, వాకతిప్ప, కొత్తపల్లి గ్రామాల్లో ఊరేగించారు.

పాదగయలో కనుల పండువగా తెప్పోత్సవం

పిఠాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో అమ్మవార్ల తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వర స్వామి పుష్కరిణిలో హంస వాహనంపై విహరించారు. విజయదశమి పర్వదినాన నిర్వహించిన ఈ ఉత్సవం భక్తులను తన్మయత్వంలో ముంచెత్తింది. ముందుగా కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి విగ్రహాలను పల్లకీలో ఉంచి ఆలయంలో ప్రదక్షిణ చేయించారు. అనంతరం జమ్మి చెట్టు వద్ద శమీ పూజ జరిపారు. ఉత్సవ మూర్తులను హంస వాహనంపై ఉంచి పుష్కరిణిలో తిప్పారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం: జాయింట్ కమిషనరు శ్రీలక్ష్మి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం కలుగుతుందని కమర్షియల్ టాక్స్ (జీఎస్టీ) జాయింట్ కమిషనరు డి.శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం రమణయ్యపేటలోని కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో జిల్లా వినియోగ సమాచార కేంద్రం, కాప్కో ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా ఆర్థిక సాక్షరత పెరిగి భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జీఎస్టీ తగ్గింపుతో కలిగే లాభాలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. డిప్యూటీ కమిషనరు తోట లలిత, జిల్లా సమాచార కేంద్రం ఇన్‌చార్జి బి.శివమూర్తి, వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు హెచ్‌ఎస్ రామకృష్ణ, కొమ్మూరి శ్రీనివాసరావు, పవన్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ డబుల్ బెనిఫిట్స్ ప్రచార గోడపత్రికను కమిషనరు భావన శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా వినియోగ సమాచారం కేంద్రం, కాప్కో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీ రేట్లు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా ఉపశమనం కలిగించడమే కాకుండా మహిళా సాధికారతకు దోహదపడతాయన్నారు. జిల్లా సమాచార కేంద్రం ఇన్‌చార్జి బి.శివమూర్తి, జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ మెంబర్ హెచ్‌ఎస్ రామకృష్ణ, కొమ్మూరి శ్రీనివాసరావు, పవన్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): తాటిపర్తిలోని పద్మశాలీ చేనేత కమ్యూనిటీ హాలు వద్ద ఎంపీడీవో సెలట్‌రాజు ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన జరిపారు. టీడీపీ, జనసేన నాయకులు, వస్త్ర వ్యాపారులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

వృద్ధాశ్రమ నిర్మాణానికి శ్రీకారం

పెద్దాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నిరాశ్రయులైన వృద్ధులను ఆదుకోవడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. పీ4 లో భాగంగా ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలంలో సుమారు రూ.2కోట్ల వ్యయంతో వృద్ధాశ్రమ నిర్మాణానికి ఆయన ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి శంకుస్థాపన చేశారు. ఆర్డీవో శ్రీరమణి, తహసీల్దారు వెంకటలక్ష్మి, ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు, జనసేన పట్టణ శాఖ అధ్యక్షుడు పొలమరశెట్టి సత్తిబాబు, పారిశ్రామికవేత్తలు, కూటమి నేతలు పాల్గొన్నారు.

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్-2047 పకడ్బందీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ (సీవీఏపీ) ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ఈ యూనిట్ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఆర్డీవో కె.శ్రీరమణి, భానుకుమార్, కూటమి నేతలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నాయకులు మధుసూదనరావు, రాజ్‌కుమార్, ఏడిద కృష్ణ, గంగాధర్ ఆధ్వర్యంలో రామకృష్ణారావుపేటకి చెందిన నీలపు సత్యనారాయణరెడ్డితో పాటు 50 మంది కార్యకర్తలు చేరారు. వారికి కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు కుండల సాయికుమార్‌యాదవ్, చోడిశెట్టి రమేష్, దాట్ల కృష్ణవర్మ, నాయకులు దొడ్డి వీరేంద్ర, జ్యోతుల రాజేష్, గౌతు చిన్న, గొలపల్లి శివ, దారపు గోవింద్‌రెడ్డి, నరసింహరెడ్డి, త్రిమూర్తులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మల్లాడిని కలిసిన హుస్సేన్

కాకినాడ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పరామర్శకు వచ్చిన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును నేషనల్ ట్రస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు నవాబ్ షేక్ సర్దార్ హుస్సేన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వృద్ధాశ్రమం, పిల్లల విద్యాభివృద్ధి కోసం తమ సంస్థ ద్వారా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు.

నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవం

సామర్లకోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయ నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షుడిగా కంటే జగదీష్‌మోహనరావు (బాబు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ధర్మకర్తల మండలి సభ్యులు ఎమ్మెల్యే చినరాజప్ప నివాసానికి వెళ్లి ఆయన్ను పుష్పమాలలతో ముంచెత్తి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ కంటే బాబు, సభ్యులు చీమలకొండ వీరభద్రప్రసాద్, కొండపల్లి సత్యవాణి, తాతపూడి పవన్‌కుమార్, అలోక్‌జైన్, గూనపాటి బుల్లెమ్మ, కంచర్ల సుష్మామోహిని, మందపల్లి భానువెంకట పద్మ, గొలితి సత్యనారాయణ, బాడితమాని లక్ష్మి, తాతపూడి సత్య అరుణ్‌వంశీ, అర్చక ఎక్స్‌అఫీషియో సభ్యుడు సన్నిధిరాజు వెంకట రమణ పాల్గొన్నారు. వారి వెంట టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బాడితమాని త్రిమూర్తులు వున్నారు.



లడ్డూ పాట నగదును చైర్మన్, ఈవోలకు అందజేస్తున్న వీరేంద్ర

అమ్మవారి లడ్డూ రూ.1,22,999

కాకినాడ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యారావుపేట రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బాలాత్రిపురసుందరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన లడ్డూకు వేలం నిర్వహించారు. దీనిని వ్యాపారవేత్త చలికి వీరేంద్ర రూ.1,22,999కు దక్కించుకుని నగదును చైర్మన్, ఈవోలకు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి, కమిటీ సభ్యులు నెక్కంటి శ్రీనివాస్, నల్లూరి తులసి, తుమ్మల సునీత, తుమ్మలపల్లి సత్తిబాబు, సీహెచ్ శ్రీనివాసచౌదరి, నాయకులు నల్లూరి శ్రీనివాస్, నేమాని సత్యనారాయణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): బాలాత్రిపురసుందరి అమ్మవారిని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబరు వేటుకూరి సూర్యనారాయణరాజు, ఇతర ప్రతినిధులు చెక్క సుమిత్ర, చెక్క రమేష్, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి దర్శించుకున్నారు. వారికి ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



దాతకు స్వామివారి ఫొటో ఇస్తున్న ఈవో

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

పెద్దాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి అదే గ్రామానికి చెందిన మొయిళ్ల కొండబాబు-సత్యవేణి దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఈవో వడ్డి శ్రీనివాసరావుకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మొయిళ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసంతర్పణ



కాకినాడ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా మెయిన్ రోడ్డులోని సూపర్‌బజార్ ఆధ్వర్యంలో భారీ అన్న సంతర్పణను ముఖ్య అతిథులుగా హాజరైన కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం ప్రారంభిం చారు. సుమారు ఐదువేల మందికి అన్న ప్రసాదం అందజేశారు. సూపర్‌బజార్ చైర్మన్ ప్రెసింగి ఆదినారాయణ, సీఈవో శివాజీ గణేష్, వైస్ చైర్మన్ మల్లిపూడి శివరామకృష్ణ, డైరెక్టర్లు మన్నే నాగేశ్వరరావు, బి.బాలకృష్ణ, ఏబీటీ నమశ్శివాయ, ఎం.శివరాంప్రసాద్, డీవీ ప్రసాద్, డీవీ ఆదినారాయణ, సుబ్రహ్మణ్యంచౌదరి, సూపరింటెండెంట్ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

జగ్గంపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ టి.రఘునాధరావు ఆధ్వర్యంలో విజయదశమి సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా ఈ ప్రత్యేక పూజా చేశామని, పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

కూటమి పాలనలో అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే



కిర్రాబులో పంచాయతీ కార్యాలయానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

రాజవొమ్మంగి అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కిర్రాబు పంచాయతీ భవనం రూ.38లక్షలతో, మొల్లిమెట్ల అంగన్వాడీ భవనం రూ.12లక్షలతో నిర్మించేందుకు ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. రంపచడోవరం నియోజకవర్గం వ్యాప్తంగా అనేక ప్రభుత్వ భవనాలు నిర్మాణాలు చేపట్టామన్నారు. కిర్రాబు ఆనకట్ట విషయంలో త్వరలోనే అందరూ శుభవార్త వింటారన్నారు. అనేకసార్లు అధికారులు, ముఖ్యమంత్రి దృష్టికి కిర్రాబు ఆనకట్ట విషయం తీసుకువెళ్లామన్నారు. అసెంబ్లీలో కూడా ఈవిషయం ప్రస్తావించానన్నారు. కిర్రాబు సర్పంచ్ బొర్రా బుజ్జమ్మ, టీడీపీ, జనసేన, బజేపీ మండలాల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, బొదిరెడ్డి త్రిమూర్తులు, తాము సూరిబాబు, ఏఎంసీ ఛైర్మన్ లోతా లక్ష్మణరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణజాల తాతారావు ఉన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

వీఆర్‌పురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వీఆర్‌పురం, వివిధ గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు. గురువారం దుర్గమ్మ ఆలయాల్లో అధికసంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. వీఆర్‌పురంలోని వీడియో బజారులో అమ్మవారి మండపం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు ఉప్పనపల్లి సాయి, కోట్ల అప్పాజి, ముత్యాల మధు, కడుపు సాయి ఆధ్వ ర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. 2వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు.

గాంధీ జయంతి వేడుకలు

మోతుగూడెం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం మార్కెట్ సెంటర్ ఉన్న గాంధీ విగ్రహానికి సర్పంచ్ ఆకేటి సీత, టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, శ్రీరామ్ చంద్రమూర్తి, కర్ల శ్రీనుబాబు, మంచిశెట్టి కృష్ణ, జాజుల రత్నాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీఆర్పీఎఫ్ పోలీసుల స్వచ్ఛభారత్

మోతుగూడెం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం ఏ/42 సీఆర్పీఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో గురు, శుక్రవారం సీఐ వెంకటేష్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. మోతుగూడెంలోని పలు ప్రధాన వీధుల్లో చెత్తా, చెదారం తొలగించి రోడ్లను శుభ్రం చేశారు.

ఇళ్లు త్వరితగతిన నిర్మించుకోండి

వై.రామవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ శాఖ మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ సూచించారు. శుక్రవారం చవిటిదిబ్బలు గ్రామంలో జరిగిన పీఎం జన్‌మన్ గ్రౌండ్ మేళాలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో జమ అవుతున్నాయన్నారు. ఈసందర్భంగా ఇళ్ల నిర్మాణ శంకుస్థాపనలో ఆయన పాల్గొన్నారు. అలాగే తోటకూరపాలెం అంగన్వాడీ సెంటర్, కేజీబీవీ వసతి గృహాన్ని, స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాపన్నదొర, ఎంపీపీ ఆనందరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు విశ్వామ్మ, జోగిరెడ్డి, హౌసింగ్ ఇంజనీరు పాల్గొన్నారు.

ఆసుపత్రి సెక్యూరిటీ గార్డ్ కుమారుడికి ఎంబీబీఎస్ సీటు



చింతూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): చింతూరు ఏరియా ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తోన్న శ్రీనివాసరావు కుమారుడు సంతోష్ కుమార్ నీట్‌లో ప్రతిభ కనబర్చి ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించాడు. చింతూరుకు చెందిన శ్రీనివాసరావు కుమారుడిని తెలంగాణలో చదివిస్తున్నాడు. సంతోష్ కుమార్ మే 2025 నీట్ పరీక్ష రాసి 367 మార్కులు సాధించాడు. ఆల్ ఇండియాలో 27,8012 ర్యాంకు, ఎస్సీ కేటగిరిలో 22వేల ర్యాంక్ సాధించాడు. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లోని ప్రతిమ వైద్య కళాశాలలో ఫ్రీ సీటు వచ్చింది. శ్రీనివాసరావును పలువురు అభినందించడంతో పాటు సంతోష్‌కుమార్‌ని శుక్రవారం సన్మానించారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి

చింతూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కూనవరం గ్రామ పంచాయతీలో జరిగిన నిధులు దుర్వినియోగంపై నిగ్గు తేల్చాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెరపాటి రవీంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్‌కు వినతి పత్రం అందజేశారు. కాల పరిమితి ముగిసినప్పటికీ ఉపసర్పంచ్‌ను సర్పంచ్‌గా కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై చేపట్టిన విచారణపై కూడా ఆయన ఆరోపణలు చేశారు.

2వేల క్యూసెక్కుల విడుదల

మోతుగూడెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి 2వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని జెన్‌కో ఏఈఈ శివశంకర్ తెలిపారు. గురువారం అల్పపీడన ప్రభావంతో ఎగువన కురిసినభారీవర్షానికి డొంకరాయి జలాశయానికి ఇన్‌ఫ్లో పెరగడంతో గురువారం నీటి మట్టం 1035.70అడుగులకు చేరింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8గంటల వరకు ఆరువేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశామన్నారు. శుక్రవారం ఉదయం 8గంటలకు నీటి మట్టం 1034.80 అడుగులకు తగ్గుముఖం పట్టడంతో నీటి విడుదలను 6వేల క్యూసెక్కుల నుంచి 2వేల క్యూసెక్కులకు తగ్గించినట్లు ఆయన తెలిపారు. అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి డొంకరాయి పవర్ కెనాల్ ద్వారా మరో4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు.

'ఆదివాసీ నిరుద్యోగులకు అన్యాయం'

రాజవొమ్మంగి అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆదివాసీ నిరుద్యోగుల గొంతు కోసిందని ఆదివాసీ హక్కులు, ఉద్యోగ సాధన కమిటీ అధ్యక్షుడు సిరిమల్లి రెడ్డి అన్నారు. శుక్రవారం రాజవొమ్మంగిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలముందు 5వ షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాలు గిరిజనులతోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, ఇటీవల తీసిన మెగా డీఎస్సీలో గిరిజన నిరుద్యోగులకు పోస్టులు లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈనెల13న రంపచోడవరంలో చేపట్టే ఆందోళనలో అధికసంఖ్యలో నిరుద్యోగులు పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ హక్కులు, ఉద్యోగాల సాధన కమిటీ అడ్వైజర్ వంతు బాలకృష్ణ, వరప్రసాద్, వెంకటరమణ, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

లక్ష్మీపురం గ్రామ సచివాలయానికి గ్రహణం!

విధులకు డుమ్మా కొడుతున్న సిబ్బంది

ఎటపాక, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి) గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అందకుండా పోతున్నాయి. లక్ష్మీపురం గ్రామ సచివాలయానికి గ్రహణ పట్టింది. వారం రోజులుగా సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకాకపోవ డంతో గ్రామసచివాలయం మధ్యాహ్నం దాటిన తర్వాత తెరుచుకుంటుంది. మారు మూల ప్రాంతం కావ డంతో ఇక్కడి సిబ్బంది తరచూ విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తు న్నాయి. దీంతో ప్రభుత్వ సేవలు, పనులు కోసం వస్తున్న ఆయా గ్రామాల ప్రజలు గంటల కొద్ది పడిగాపులు కాస్తూ నిరాశతో వెను తిరుగుతున్నారు. ఈసచివాలయం పరిధిలో 12వరకు గిరిజన గ్రామాలున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం వరకు సిబ్బంది రాకపోవడంతో గ్రామ సచివాలయం తాళం వేసి ఉంది. ఈవిషయాన్ని స్థానికులు కొందరు సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో వీఆర్వో టి.వెంకటేశ్వర్లు సచివాలయానికి చేరుకుని తలుపులు తెరిచారు. దీంతో కొందరు సచివాలయం పనితీరు, సిబ్బంది గైర్హాజరుపై నిలదీశారు.



సచివాలయం ఎదుట ఎదురుచూస్తున్న స్థానికులు

గాంధీకి ఘన నివాళి

ప్రత్తిపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేగులమ్మ గుడి గల గాంధీజీ విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను, కార్యకర్తలు కందిమళ్ళ శామ్యూల్, వి.ప్రకాష్, మూరా కృష్ణ, షేక్ అంకా సాహెబ్, కాకర ఏసు, పి.గణేష్, వి.నగేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాధ్, ఏవో మూర్తి, ఎంపీటీసీ సేంద్రపు భాస్కరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్తిపాడు కోర్టు బార్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, న్యాయవాదులు బుగతా శివ,టి.మధుబాబు, భారతి, శివకుమార్, కె.శ్రీనివాస్, సింహాద్రి సూరిబాబు, ఆర్.సీతారామరాజు, న్యాయవాద గుమస్తాలు ఎడ్ల వీరాస్వామి, పాలెపు నాగేశ్వరరావు తదితరులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. షిర్డీ నగర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మిఠాయిలు, చాక్లెట్లు పంచారు. కౌన్సిలర్ అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపీ, మూది నారాయణస్వామి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వాగు రాజేష్, సామంతుల సూర్యకుమార్, ఫైల విజయ్‌కుమార్, చందక శేషు పాల్గొన్నారు.

అన్నవరం (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి పంచాయితీ గ్రేడ్ 1 కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి నివాళులర్పించారు. పంచాయితీ ఆధ్వర్యంలో జీఎస్టీ రేట్ల తగ్గింపుపై కరపత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా, ఆశీన శ్రీను పాల్గొన్నారు. చినరావిచెట్టు సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి హ్యూమన్ రైట్స్ రాష్ట్ర లీగల్‌సెల్ అధ్యక్షుడు బత్తుల రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాసరి సత్యనారాయణ, బొబ్బిలి వెంకన్నబాబు, కొండపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి జనసేన జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసైనికులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీసీసీ సభ్యుడు శ్రీను, నాయకులు



ఏలేశ్వరంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కబడ్డీ టోర్నమెంట్‌కు 'ఆదిత్య' జట్టు



కబడ్డీ పోటీలకు ఎంపికైన ఆదిత్య జట్టు

గండేపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ తరుపున కబడ్డీ జట్టు ఈనెల 4 నుంచి 7 వరకు కర్ణాటకలో జరిగే రాణి చెన్నమ్మ యూనివర్శిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ కబడ్డీ మెన్ టోర్నమెంట్-2025లో పాల్గొనేందుకు వెళ్లినట్లు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సౌత్‌జోన్‌కి సెలెక్ట్ అయ్యి టోర్నమెంట్‌లో పాల్గొనే టీం అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ కనబరిచి విజయంతో తిరిగిరావాలని ఆకాంక్షిస్తూ టీమ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్, డీన్ డాక్టర్ డి.కిషోర్, వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ ఎన్.రవి పాల్గొన్నారు.

ఎస్.పైడిపాలలో ప్రజాభిప్రాయసేకరణ



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఈఈ మూర్తి

రౌతులపూడి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్.పైడిపాల గ్రామంలో రోడ్ మెటల్ నిర్వహణ కోసం శనివారం ఆర్డీవో శ్రీరమణి, కాలుష్య నియంత్రణమండలి ఈఈ ఏఎన్ఆర్వీ మూర్తి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. మైనర్స్ సిద్ధి ఇనాస్ట్రక్చర్ ప్రాజెక్టు లిమిటెడ్ సర్వేనెంబర్ 15-పిలో 3.5 హెక్టార్లో దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, గ్రామానికి సీఎస్ఆర్ నిధులు కేటాయింపు, స్కిల్ డెవలప్‌మెంట్, యువతకు ఉద్యోగాలు తదితర సమస్యలను వివరించారు. కాలుష్యంపై చర్యలు చేపట్టాలన్నారు. ఎస్వీవోలు, జడ్పీటీసీ గొల్లు చినదివాణం, టీడీపీ నేతలు గొల్లు పెద్దదివాణం, సత్తిబాబు పాల్గొన్నారు.

రాచపల్లిలో గణపతి హోమం

ప్రత్తిపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గణపతి హోమంలో ఎమ్మెల్యే, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్య నారాయణ రాజు (మీసాల రాజు) వ్యవసాయ క్షేత్రంలోని నూతన గృహం వద్ద ఈ హోమాలు, పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష్ ప్రత్యేక అతిథులుగా విచ్చేసి హోమాల వద్ద పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు వర్మ, వరుపుల సుబ్బారావు, పర్వత ప్రసాద్, వంతల రాజరాజేశ్వరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, విశ్రాంత డీఎస్పీ బి.అప్పారావు, జనసేన నాయకురాలు బొర్లపూడి క్రాంతి, ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, కూటమి నాయకులు బుద్ధరాజు గోపిరాజు తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీ ఉదయ్, ఎమ్మెల్యే సత్యప్రభ

రైతులకు అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ రంగంలో చేకూరిన ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు జగ్గంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు కార్యాలయం వద్ద నిర్వహించిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. వ్యవసాయ కార్యాలయానికి చేరుకున్న నెహ్రూ ట్రాక్టర్లు, విత్తనాలు, ఎరువులు, మోటర్ స్పేర్స్ తో అక్కడ ఏర్పాటు చేసిన వ్యవసాయ పరికరాల ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం తాళ్లూరు గ్రామానికి చెందిన రైతు గ్రూప్‌కు సబ్సిడీ ద్వారా మంజూరైన డ్రోన్ అందించారు. స్వయంగా ట్రాక్టర్ నడిపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి జ్యోతుల కాలనీ వరకు కొనసాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి అండగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమం లో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్, జీను మణిబాబు, అత్తులూరి నాగబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పైడిపాల సూరి బాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, పీలా మహేష్, గరిమెళ్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

'దాడి చేసిన దోషులను అరెస్టు చేయాలి'



ధర్నా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు

జగ్గంపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రంగవల్లి నగర్ కాలనీలోకి అక్రమంగా చొరబడి, ఏరుకల కులానికి చెందిన వారిపై దాడి చేసి, కులం పేరుతో దూషిస్తూ, కొట్టి, చిత్రహింసలు పెట్టిన అగ్రవర్ణాలకు చెందిన వారిని అరెస్టు చేయాలని, ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసులపై న్యాయవిచారణ చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగ్గంపేట ఎమ్మార్వో ఆఫీస్ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్, మెజిస్ట్రేట్‌కి వినతిపత్రం ఇచ్చారు. ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దీనిపై న్యాయ విచారణ చేపట్టి, ఎస్టీలపై దాడులు చేసిన అగ్రవర్ణ దోషులను తక్షణం అరెస్టు చేయాలని కోరారు. ఏపీఆర్‌సిఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వి.రాజబాబు, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) నాయకులు రమ ఆర్. దుర్గాదేవి, భద్రాది, సోమరాజు తదితరులు నాయకత్వం వహించారు. బాధితులు, బాధితుల బంధువులు సన్నిహితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు లబ్ధి'

ఏలేశ్వరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో రైతులు యంత్రాలు కొనుగోలు, పేదలు నిత్యావసర సరుకులు కొనుగోళ్లలో పెద్దమొత్తం లబ్ధి చేకూరుతుందని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని యర్రవరం గ్రామంలో రైతులత సమావేశం నిర్వహించి, కరపత్రాలు పంచారు. టీడీపీ నాయకులు బసా ప్రసాద్, మైరాల కనకారావు, తోట వెంకటేశ్వరరావు, గంగిరెడ్ల మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆదివాసీ సంఘ సమావేశం

జగ్గంపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గోవిందపురంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆదివాసీ సంఘం సమావేశం శుక్రవారం జరిగింది. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారు రావు, జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున్ రావు మాట్లాడారు. డిసెంబరు 6,7 తేదీల్లో కడపలో జరిగే రాష్ట్ర మహాసభలు, అక్టోబర్ 28న జగ్గంపేటలో జరిగే కాకినాడ జిల్లా మహాసభను విజయవంతం చేయాల న్నారు.

హంస వాహనంపై దుర్గమ్మ ఊరేగింపు

జగ్గంపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పద్మనాభ నగర్ చెరువుగట్టుపై శ్రీ కనకదుర్గ ఆలయం వద్ద దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మంచినీటి చెరువులో అమ్మవారిని హంస వాహనంపై ఊరేగించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, జగ్గంపేట మండలాధ్యక్షుడు జీను మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి

కోటనందూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గాంధీ జయంతి వేడుకలునిర్వహించారు. కోటనందూరులోని సీనియర్ టీడీపీ నాయకుడు వెలగా వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక మండల పరిసత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటనారాయణ, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వీవీ సత్యనారాయణ, మదర్ విద్యా సంస్థలో చైర్మన్ పెనుముచ్చు నాగేశ్వరరావురామానుజన్‌లో రావాడ వరహాలబాబు, శ్రీసాయి విద్యాసంస్థలో బంగారు లక్ష్మీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటనందూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కోటనందూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ వీరభద్రరావు తెలిపారు. బీమవరపుకోట, కోటనందూరు, అల్లిపూడి, జగన్నాధపురం, టి.జె.నగరం, బొద్దవరం, కేవీ చిన్నయ్యపాలెం, పి.కొట్టాం తదితర గ్రామాల్లో ఉదయం 9నుంచి 2గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు అభినందనలు

తుని రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తుని బాలికోన్నత పాఠశాలలో విద్యను అభ్యసించి ఖోఖో ఆటలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించిన బి.జానకి, జి.సత్య, బి.స్వాతిలకు పలువురు అభినందనలు తెలిపారు. బి.జానకి, జి.సత్య, బి.స్వాతిలను రాజా కళాశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.తులసి, డీఎస్సీ కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయుడు ఎన్‌వీఆర్ మూర్తి,ఖోఖో సంఘం జిల్లా అధ్యక్షుడు పట్టాభిరామ్, కార్యదర్శి శ్రీనివాస కుమార్‌లు అభినందించారు.

నేడు తునిలో ఆటో డ్రైవర్లకు ఆర్థిక చేయూత

తునిరూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తునిలో ఆటో డ్రైవర్ల చేయూత కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంపీడీవో సాయి నవీన్ తెలిపారు. శనివారం రాజా కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే యనమల దివ్య చేతులమీదుగా ఆటో డ్రైవర్లకు రూ.15వేలు చొప్పున అందించనున్నట్లు ఆమె తెలిపారు.

ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు

కోటనందూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో శరన్నవరాత్రిముగింపు వేడుకలు ముగిసాయి. జగన్నాధపురంలో శ్రీకనకదుర్గా అమ్మవార్ని సాంస్కృతి కార్యక్రమాలతో ఊరేగించి నిమజ్జనం చేశారు.

రౌతులపూడి, (ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లో ప్రజలు విజయదశమి వేడులకలను ఘనంగా నిర్వహించుకున్నారు. రౌతులపూడి, మూలగపూడి, ఎస్ఎస్‌పట్నం, శృంగవరం, బంగారయ్య పేట, ఎల్ఆర్ పాలెం తదితర గ్రామాల్లో కుటంబ సభ్యులతో కలిసి విజయదశమిని నిర్వహించుకున్నారు. రౌతులపూడిలో వివిధ రకాల వేషధారణలతో, మందుగుండు, బ్యాండ్‌మేళాలతో అంగరంగా వైభవంగా అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. 32 రెండు కేజీల అమ్మవారి ప్రసాదం లడ్డూనూ రౌతులపూడికి చెందిన శ్రీకృష్ణ యదవ సంఘం సభ్యులు 21 వేలు వేలం పాటలో దక్కించుకున్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

కోటనందూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాతకొట్టాంలో రామాలయంవద్ద ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్ఎస్ఎస్ వక్త తిరుపతిరావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ లక్ష్యం, విధులు, చేస్తున్న సేవలు వివరించారు. అనంతరం పలువురు యువకులు ఆర్ఎస్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో యడ్ల చెల్లారావు, ప్రసాద్, పలకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రత్తిపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒమ్మంగి 11కేవీ ఏసీఎల్ ఫీడర్‌పై గల ఒమ్మంగి, రాచపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిలుపుదల చేస్తున్నట్టు జగ్గంపేట ఈఈ వీరభద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తలైన్ల పునరుద్ధరణ, విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల అంతరాయాన్ని వినియోగదారులుగమనించి సహకరించాలని కోరారు.

నారా లోకేశ్ ఫౌండేషన్ సామాజిక సేవ

ప్రత్తిపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ అధ్యక్షుడు అడపా జగదీష్ ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం స్థానిక జాతీయ రహదారిపై సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విజయవాడకు పాదయాత్రగా వెళ్తున్న భవానీలకు వాటర్‌బాటిల్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గ్లూకోజ్ బాటిల్స్ పంపిణీ చేశారు.

రేషన్‌షాపు ప్రారంభం



రేషన్‌షాపు ప్రారంభిస్తున్న దృశ్యం

గండేపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి నేలకుండీలపేట కాలనీలో రేషన్ డీలర్ జునుపే దేవి 27వ నెంబరు రేషన్‌షాపును టీడీపీ గ్రామాధ్యక్షుడు తెలగరెడ్డి భద్రరావు, మల్లేపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు డిడ్డి చిన్న శ్రీను ప్రారంభించారు. లబ్ధిదారులకు సరుకులు అందజేశారు. తెలగరెడ్డి ప్రకాశ్, దార్లంక నూకరాజు, రామకుర్తి నరసింహం, ఇంటి సత్యనారాయణ, తలారి బాబురావు ఉన్నారు.

ఆలయానికి ఆభరణాల బహూకరణ



అమ్మవారిని దర్శించుకుంటున్న వినాయకవర్మ కుటుంబీకులు

కిర్లంపూడి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): చిల్లంగిలోని శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో ప్రముఖ బిల్డర్ సంపర సుధాకర శ్రీవినాయక్ వర్మ, వెంకటలక్ష్మి దంపతులు, వారి కుమార్తెలు అమ్మవారికి రూ.10.40లక్షలు విలువ చేసే పది జతల బంగారు శతమానాలు, 10 ముక్కుపుత్తులు అందించారు. సుధాకర సేవలు అభినందనీయమని కమిటీసభ్యులు కొనియాడారు.

లాల్‌బహదూర్‌కు నివాళి

ఏలేశ్వరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కార్యాలయం వద్ద మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతిని నిర్వహించారు. కౌన్సిలర్ అలమండ చలమయ్య నేతృత్వంలో లాల్ బహదూర్‌శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేషు, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీహోమం

అన్నవరం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించారు. అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు.



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు